నిర్మలమ్మ ఇన్నాళ్లకు కరుణించారు. ఆదాయపు పన్ను పరిమితులను పెంచుతూ ఎట్టకేలకు పద్దులో పెద్ద పీట వేశా రు. పెరిగిన ఖర్చులకు తోడు ఎడాపెడా ఆదాయపు పన్ను వాతలతో వెన్ను విరిగిన ప్రభుత్వ, ప్రైవేటు జీవులకు ఊరట కల్పించారు. రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయానికి ఎలాంటి పన్ను కట్టక్కర్లేదని పార్లమెంట్ సాక్షిగా బడ్జెట్‌లో ప్రకటించారు. అటు వృద్ధులకూ నిర్మలమ్మ పద్దు వరాలు కురి పించింది. వడ్డీపై ఆదాయంతో పాటు అద్దెపై వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని పెంచి వారిని ఆకట్టుకుంది. అన్నదాత లకు కిసాన్ క్రెడిట్ కార్డుల రూపంలో అప్పు పరిమితి పెంచిం ది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు నిధులు విదిల్చి ఉమ్మడి జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేస్తోన్న రైతులకు తీపికబురు అందించింది. అటు చిన్న తరహా పరిశ్రమలకు ఊతమిస్తూనే కాకినాడ కేంద్రంగా ఉన్న షిప్ బిల్డింగ్ రంగం మరింతగా ఎదిగేలా వెన్నుదన్నుగా నిలిచింది. వెరసి కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలను మెప్పించి మురిపించింది. - (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

– అమలాపురం(ఆంధ్రజ్యోతి):



ముురిపించే!



బడ్జెట్ బాగు..బాగు

వేతన జీవులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను మురిపించింది. ఎప్పుడూ వాతలతో సాగే బడ్జెట్ ఈ దఫా కొన్ని వరాలతో మెప్పించింది. ప్రధానంగా ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలంటూ ఎన్నో ఏళ్లుగా వేతన జీవులు వేడుకుంటున్నా కనికరించని ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈ సారి మొర విన్నారు. ఏకంగా రూ.12 లక్షల వార్షికాదాయం వరకు ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించక్కర్లేదని ప్రకటించి ఉద్యోగులపై వరాల వాన కురిపించారు. ఈ నిర్ణయంతో రూ.12 లక్షల వార్షికాదాయం పొందుతున్న వారికి రూ.80 వేల వరకు పన్ను పోటు తప్పి జేబులో డబ్బు మిగల నుంది.ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 63 వేల మందికి లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా వీరిలో 22 వేల మందికి వార్షిక వేతనం రూ.12 లక్షల వరకు వస్తోంది. వీరికి రూ.80 వేల వరకు మిగ లనుంది. మిగిలిన 41 వేల మంది ఉద్యోగులకు సైతం రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.65 వేల వరకు ప్రయోజనం కలగనుంది. అయితే కొత్త పన్ను విధానం కింద శ్లాబులను ప్రకటించడం కొంత గందరగో ళానికి గురి చేసింది. దీని ప్రకారం రూ.4 లక్షల వరకు సున్నా పన్ను,రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పన్ను 5 శాతం, రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 10 శాతం పన్ను శ్లాబు లను ప్రకటించారు. ఈ శ్లాబు ప్రకారం రూ.12 లక్షల వార్షిక వేతనం ఉన్న వారు పది శాతం పన్ను చెల్లించాల్సి ఉండగా దా న్ని సెక్షన్ 87ఏ రిబేట్ కింద బడ్జెట్‌లో మినహాయిం పునిచ్చారు.దీంతో పన్ను సున్నాగా మారింది. దీనికి తోడు స్టాండర్డ్ డిడక్షన్ సైతం కలిపితే రూ.12.75 లక్షల వార్షికా దాయం వరకు పన్ను చెల్లించ క్కర్లేదు.దీనికి ఒక్క రూపాయి పెరిగినా పన్ను పరిధిలోకి వచ్చేస్తారు.బడ్జెట్ నిర్ణ యం నేప థ్యంలో రూ.8 లక్షల వార్షిక వేతనం ఉంటే రూ.30 వేలు, రూ.9 లక్షలకు రూ.40 వేలు, రూ.10 లక్ష లకు రూ.50 వేలు, రూ.11 లక్షలకు రూ.65 వేల వరకు పన్ను పోటు తప్పింది.





పంట పండింది..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2.30 లక్షల హెక్టార్లలో వరి సాగవు తోంది.మొత్తం 5.40 లక్షల మంది రైతులు సాగుచేస్తున్నారు.వీరికి పంట రుణాల కింద ఏటా రూ.7,150 కోట్ల వరకు వివిధ బ్యాంకులు అందిస్తు న్నాయి. అయితే బ్యాంకులు షరతులతో ఇబ్బందులు పెడుతు న్నాయి.కౌలురైతులకు అప్పు పుట్టని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టి సాలీనా ఏడు శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణాలంది స్తోంది. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ ప్రక టిస్తోంది.ఈ సదుపాయాన్ని ఉమ్మడి జిల్లాలో వరి,ఇతర వాణిజ్య పంటల సాగుకు సుమారుగా 70 వేల మందికిపైగా అన్నదాతలు వాడుకుంటు న్నారు. పశుసంవర్ధకశాఖ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,600 మంది రైతులు ఈ కార్డులు వినియో గిస్తున్నారు. బడ్జెట్‌లో ఇప్పు డు రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడంతో వేలాది మంది అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించింది.ఈ నిధులు ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వేలాది మంది రైతులకు ఆర్థికంగా అండ కల్పించనుంది.జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలు సాగవుతోంది. ఇందులో కాకినాడ జిల్లాలోనే 45 వేల ఎకరాలు ఉంది.

- వేతన జీవులకు, వృద్ధులకు ఊరట
- రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను జీరో
- ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షలమందికి లబ్ధి
- వార్షిక వేతనం రూ.12.75 లక్షలున్నా నోట్యాక్స్
- వృద్ధులకు వడ్డీ, అద్దెలపై పరిమితుల పెంపు
- నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు
- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు
- ఎంఎస్ఎంఈలకు రుణాల పెంపు
- 24 వేలకుపైగా చిన్న కంపెనీలకు ఊతం
- నౌకా రంగానికి భారీవరాలు
- ఉమ్మడి జిల్లాలో 3 డే కేర్ క్యాన్సర్ సెంటర్లు

నౌకాయానం..



నౌకల తయారీ రంగానికి ఈ దఫా బడ్జెట్‌లో కేంద్రం భారీగా ప్రోత్సా హకాలు ప్రకటించింది.దీంతో కాకినాడలో తయారవుతున్న నౌకలకు సంబంధించి ఆయా సంస్థలకు భారీ గా ఆర్థిక ప్రయోజనాలు చేకూరడంతో పాటు ఈ రంగం మరింతగా ఎదగడా ని కి అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కాకి నాడలో శాన్ మెరైన్ సంస్థ నౌకల తయా రీలో పేరొందింది. భారీ నౌకల నుంచి మధ్య తరహా షిప్‌లు తయారు చేస్తోంది. అనేక మత్స్యకార సంస్థలు సైతం పెద్ద పెద్ద టగ్‌లు తయారు చేస్తున్నాయి. ప్రధానంగా నౌకల తయారీకి విదేశాల నుంచి ఎక్కువగా అనేక పరికరాలు దిగుమతి చేసుకోవాలి. ప్రస్తుతం వీటిపై సరాసరి 23 శాతం వరకు పన్ను వసూలు చేస్తు న్నారు.కానీ ఇకపై ఇది సున్నా. పదేళ్ల పాటు ఇది అమల్లో ఉండనుంది.నౌకల తయారీకి అయ్యే కోట్ల కొద్దీ ఖర్చుకు సంబంధించి ఆయా కంపెనీలు,సంస్థలు తెచ్చే రుణాలపై ఇంత వరకు సబ్సిడీ లేదు.ఈ బడ్జెట్‌లో ఏకంగా 20 శాతం ఫైనాన్స్ సబ్సిడీ ప్రకటిం చింది.నౌకల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. నౌకల తయారీ భవిష్యత్తులో కాకినాడ కేంద్రంగా ఎదిగే అవకాశం ఏర్పడిందని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా విశ్లేషించారు.

క్యాన్సర్ రోగులకు తగ్గనున్న భారం



క్యాన్సర్ రోగులకు దీర్ఘకాలిక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో బాధితులకు ఊరట దక్కింది. ఖరీదైన మందులు కొనలేక ఆర్థికంగా చితికిపోతున్నారు.మందుల ధరలు దిగిరానుండడం ఊరటనివ్వనుంది. దేశ వ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు కానున్నా యి.ఈ కేంద్రాల్లో బాధితులకు వైద్యసాయం లభించనుంది.

చిన్న వాటికి పెద్ద ఊతం..

బడ్జెట్‌లో చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎం ఎస్ఎంఈ)కు రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెంచారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికవేత్తలకు మేలు జరగనుంది.ఉమ్మడి జిల్లాలో 24 వేల వరకు చిన్నతరహా పరిశ్ర మలున్నాయి.బ్యాంకుల నుంచి రుణాలిస్తున్నా సరిపోవడం లేదు. దీంతో బయట నుంచి అప్పులు తెచ్చి నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన రుణ పెంపు ప్రకటన మేలు చేయనుంది. అటు స్టార్టప్‌లకు రుణాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచేలా బడ్జెట్ లో ప్రకటించడం అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వెన్ను దన్నుగా లభించనుంది.

వృద్ధులకు వరాలు..



వృద్ధుల ఆదాయాన్ని సైతం వదలకుండా ఇన్నాళ్లు పన్ను పేరుతో జేబులు గుల్ల చేసేసిన కేంద్రం ఈ దఫా బడ్జెట్‌లో వారి చేతిలో డబ్బు లాక్కోకుండా ఎంతో కొంత మిగిలేలా నిర్ణయం తీసుకుంది. వృద్ధులు ఆర్జించే బ్యాంకు డిపా జిట్ల వడ్డీపై పన్ను మినహా యింపును పెంచింది. ప్రస్తుతం ఇది రూ.50వేలు ఉండ గా దాన్ని రూ.లక్షకు పెం చారు. అటు అద్దె ఆదాయంపై ఉమ్మడి జిల్లాలో అనేక మంది వృద్ధులైన ప్రభు త్వ ప్రైవేటు రిటైర్డ్ ఉద్యో గులు జీవిస్తున్నారు. వీరికి కూడా నిర్మలమ్మ తీపికబురు అందించారు.వీరికి అద్దెపై వచ్చే వార్షికాదాయం రూ.2.40 లక్ష లు దాటితే చెల్లించాల్సిన పన్నును మినహా యించి రూ.6 లక్షలకు పెంచారు. దీంతో వందలాది మందికి మేలు కలగనుంది.

పిల్లలతో ప్రయోగాలే ప్రయోగాలు..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 170 వరకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. కొత్త తరహా ప్రయోగాలు ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం ఏటా వీటిని మంజూరు చేస్తోంది. ఒక్కో దానికి రూ.20లక్షల వరకు వెచ్చిస్తోంది. బడ్జెట్‌లో వీటికి కేంద్రం మరింత పెద్దపీట వేసింది. 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది.దీంతో ఉమ్మడి జిల్లాకు భారీగా ఈ ల్యాబ్‌లు మంజూరు కానున్నాయి. తద్వారామరిన్ని పాఠశాలల్లో సైన్స్‌పై విద్యార్థులు ప్రయోగాలు చేసే సౌలభ్యం పెరగనుంది.

పోలవరం ప్రాజెక్టుకు భారీ ఊతం

బడ్జెట్‌లో పోలవరంపై కేంద్రం మరింత కనికరం చూపింది. చాన్నాళ్ళుగా మూలనపడిన ఈ ప్రాజెక్టును గట్టెక్కించే దిశగా శరవేగంగా నిధులు కేటాయిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర బడ్జెట్‌లోను పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్ల పద్దు చూపించారు. గడిచిన ఐదేళ్లలో ఇంత మొత్తంలో పోలవరానికి కేటాయించడం దాదాపు ఇదే ప్రథమం. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీనికి కేంద్రం కూడా ఊతమిస్తూ వస్తుంది. తాజాగా 12 వేల కోట్ల రూపాయలు ఈ మధ్యనే కేంద్రం ప్రకటించగా ఇప్పుడు తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోను ఐదు వేల కోట్లకుపైబడి కేటాయింపులు పేర్కొనడం పట్ల హర్షం వ్యక్తమవుతుంది. ఇంతకుముందే పోలవరం నిర్మాణానికి గ్రాంటు రూపంలో 12 వేల 157 కోట్ల రూపాయలు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.54 కోట్లు కేటాయించారు.ఈ నేపథ్యంలో పోలవరం పూర్తి కావడానికి ఇక ఆటంకాలు లేవనే పరిస్థితి ఉంది. ఇక ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగేందుకు ఒకవైపు విడుదల చేసిన గ్రాంటు, మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు బట్టి చూస్తే ఇట్టే అవగతమవుతుంది.

మేలు చేకూర్చే బడ్జెట్



వార్షిక బడ్జెట్ ప్రజలకు మేలు చేకూర్చేలా ఉంది. వికసిత్ భారత్ విజన్‌ను ప్రతిబింబించేలా ఉంది. అన్ని వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. రానున్న ఐదేళ్లలో కీలక రంగాల అభివృద్ధికి ఈ బడ్జెట్ మార్గదర్శకం అవుతుంది.

- హరీష్‌మాథుర్, అమలాపురం ఎంపీ

ఇది వికసిత్ భారత్ బడ్జెట్



వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షలకు పెంపు , రూ.12 లక్షల వరకు ఆదాయపపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయం.

- వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి

అన్ని వర్గాలకు ప్రాధాన్యం



కేంద్ర బడ్జెట్ జనరంజకంగా ఉంది. దేశంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యతను ఇచ్చారు. ఇన్‌కంట్యాక్సు తగ్గింపుతో పాటు నిత్యావసర ధరలు తగ్గించటం అన్ని వర్గాలకు మేలు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ప్రధాని నరేంద్రమోదీకు వేగుళ్ల కృతజ్ఞతలు తెలిపారు.

వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం



ఈ బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది. బడ్జెట్‌లో అన్ని ప్రాధాన్యతా రంగాలకు నిధులు కేటాయించారు. ఆదాయ పన్ను విషయంలో వ్యక్తిగత ఆదాయ పరిమితిని రూ.12 లక్షల వరకు పెంచడం హర్షణీయం.

డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్, అమలాపురం

రాష్ట్రానికి మొండిచెయ్యి



బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం మొండి చెయ్యి చూపించింది. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టింది. జాతీయ విద్యా సంస్థలకు ఏ విధమైన కేటాయింపులు చేయలేదు.

కారెం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కన్వీనర్, అమలాపురం

బడ్జెట్‌పై నేతల మాట

రాష్ట్ర ప్రగతికి బంగారు బాట



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి బంగారు బాటలు వేస్తుంది. విద్యా రంగానికి పెద్దపీట వేశారు. విద్యార్థుల కోసం 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయడంతో పాటు 75వేల మెడికల్ సీట్లను పెంచడం శుభపరిణామం. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే 36 రకాల ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా ఎత్తివేశారు. స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం శుభపరిణామం.

దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, అల్లవరం

రైల్వేలైన్‌కు నిధుల కొరత లేకుండా చూడాలి



కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కొరత లేకుండా చూడాలి. గత ఏడాది మాదిరిగానే రైల్వేకు రూ.2.52 లక్షల కోట్లు కేటాయించారు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయిస్తారన్న ఆశాభావం ఉంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా విద్యా రంగానికి జరిపిన కేటాయింపులు ఎంతో మేలు చేకూరుస్తాయి. రైతుల కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం శుభపరిణామం.

చింతా శంకరమూర్తి, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ, బండారులంక

అన్ని వర్గాలకు వరం



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసే విధంగా ఉంది. రైతు కిసాన్ క్రెడిట్ కార్డు రుణం పెంపు, ఔషధాలపై కస్టమ్ డ్యూటీ ఎత్తివేయడం వంటి అంశాలు ఆమోదయోగ్యం.

యాళ్ల దొరబాబు, బీజేపీ నాయకుడు

సంక్షేమానికి పెద్దపీట



నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాల సంక్షేమానికి సంబంధించి పెద్దపీట వేశారు. ఎలక్ట్రిక్ పరికరాలు, నిత్యావసర ధరలు తగ్గింపునకు చర్యలు తీసుకోవటం అభినందనీయం..

వేగుళ్ల లీలాకృష్ణ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, మండపేట

ఆమోదయోగ్యమైన బడ్జెట్




కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్.. పోలవరం అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షనీయం. రైతులకు, వ్యాపారులకు పేదవారికి బడ్జెట్ ఎంతో ఊరట. ఇలాంటి బడ్జెట్లతో భారత్ ప్రపంచాన్ని శాసించే స్థాయికి వెళుతుంది..

పాలూరి సత్యానందం, బీజేపీ కార్యవర్గ సభ్యుడు, కొత్తపేట



డ్రైన్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళ(ఫైల్)



‘మురుగు నీరు’ నుంచి మోక్షం

ఫలితాలిస్తున్న ‘అక్షరం అండగా..’

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 3వ వార్డులో నిర్వహించిన చర్చావేదికలో వెలుగుచూసిన అనేక సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. 3వ వార్డు కల్వకొలను వీధిలో మురుగునీటి డ్రైన్‌లోనే తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితిని ఆ ప్రాంత మహిళ చింతలపూడి అనంతలక్ష్మి మున్సిపల్ అధికారుల దృష్టికి చర్చావేదికలో తీసుకువచ్చారు. స్పందించిన కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మురుగునీటి డ్రైన్ నుంచి మోక్షం కల్పించే విధంగా శనివారం చర్యలు చేపట్టారు. వార్డు కౌన్సిలర్, జనసేన మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కుండీని కట్టించడంతో పాటు కుళాయిని ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో అనంతలక్ష్మితో పాటు ఆ ప్రాంత మహిళలు హర్షం వ్యక్తం చేశారు.



ప్రత్యేక కుండీ ఏర్పాటు చేసిన దృశ్యం

‘వానపల్లి’ హామీలను త్వరితగతిన పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆగస్టు 23న కొత్తపేట మండలం వానపల్లిలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఇచ్చిన హామీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జేసీ అధ్యక్షతన హామీల పరిష్కార సరళి పురోగతిపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ గ్రామంలో సుమారు 30 హామీలను ఇచ్చారని చెప్పారు. ప్రధానంగా పళ్లాలమ్మ ఆలయం పార్కు, ప్రాంగణాభివృద్ధి, గృహనిర్మాణం, అంతర్గత సీసీ రోడ్లు, చెరువుల అభివృద్ధి, గోశాల నిర్మాణం తదితర హామీలకు సంబంధించి ఆయా శాఖల వారీగా సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తూ నిధుల విడుదలతో పాటు సాంకేతిక, పరిపాలన అనుమతులు కోరాలన్నారు. ప్రతీ వారం సీఎంవో కార్యాలయానికి నివేదిక పంపాలని ఆదేశించారు. లబ్ధిదారుల అర్హతను నిర్ధారిస్తూ గృహనిర్మాణ దరఖాస్తులపై అనువైన నివేసన స్థలాల భూసేకరణ చేపట్టాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్ అనుసంధానంతో మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రావెల్, సీసీ రోడ్ల స్థితిగతులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. గోశాలల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులు ముందుకు రావడం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి మంజూరైన గోశాల స్థానంలో ఎమ్మెల్యే సూచించిన కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి నరసింహారావు, అర్థగణాంక అధికారి వెంకటేశ్వర్లు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఏఎస్పీ ప్రసాద్

పోలీస్ లాంఛనాలతో ఎస్ఐ అంత్యక్రియలు

8లో

పారిశుధ్య చర్యలకు 860 మంది సిబ్బంది

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు సంపూర్ణ పారిశుధ్య చర్యలపై ప్రత్యేకంగా 860 మంది సిబ్బందిని నియమించినట్టు జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి తెలిపారు. పారిశుధ్య కార్మికుల పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లను నియమించామన్నారు. జిల్లాకు సంబంధించి 307 మంది స్వీపర్లతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన 75 మందితో కలిపి 382 మంది పారిశుధ్య కార్మికులను అంతర్వేది ఉత్సవాల కోసం ప్రత్యేకంగా నియమించామన్నారు. వీరిని పర్యవేక్షించేందుకు 18 మంది ఈవోపీఆర్డీలు, 66 మంది పంచాయతీ కార్యదర్శులు, 12 మంది జూనియర్ అసిస్టెంట్లను నియమించామన్నారు. ఎక్కడికక్కడ బృందాలుగా వీరిని నియమించామన్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణంతో పాటు 8వ తేదీ తీర్థం, రథోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుధ్య పనులకు ఏర్పాట్లు చేశామన్నారు.

అమలాపురం డిపో నుంచి 34 ఆర్టీసీ బస్సులు..

అంతర్వేది కల్యాణోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి 34 బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. అమలాపురం నుంచి 30 బస్సులు, పల్లం నుంచి ప్రత్యేకంగా నాలుగు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలికిపురం సెంటర్ వరకు మాత్రమే బస్సులు వెళతాయని అక్కడి నుంచి రాజోలు డిపోకు చెందిన బస్సులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రధానంగా అంతర్వేది ఉత్సవాలకు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం, భీమవరం బస్ డిపోలతో పాటు అమలాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏటా ఏర్పాటు చేస్తుంటారు. గతంలో నేరుగా అంతర్వేది దేవస్థానం వరకు బస్సులు నడిపేవారు. అయితే సింగిల్ రోడ్డు కావడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇతర డిపోలకు చెందిన బస్సు సర్వీసులను మలికిపురం సెంటర్‌కు మాత్రమే పరిమితం చేశారు. సఖినేటిపల్లి రేవు నుంచి రాజోలు డిపోకు చెందిన బస్సులు గొంది రోడ్డు మీదుగా అంతర్వేది దేవస్థానానికి వెళ్లే విధంగా, మలికిపురం నుంచి దేవస్థానానికి చేరుకునేలా బస్సు సదుపాయాలు కల్పించారు.

గోవిందా...హరిగోవిందా !


ప్రత్యేకాలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.62లక్షలు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):కోనసీమ తిరు మల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.62 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

4న గోవిందమాల దీక్షాధారణ

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాల దీక్షాధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. ఈనెల 4 రథసప్తమి మంగళవారం శ్రీనివాస శరణాగత దీక్ష ప్రారంభిస్తున్నట్టు, 24 రోజులపాటు దీక్ష ప్రారంభిస్తారని 26తో దీక్ష ముగిస్తుందన్నారు. మాలధారణ చేపట్టే భక్తులకు దేవస్థానం తరుపున దీక్షా వస్త్రాలు, మాలలు వసతి, భోజనం దేవస్థానం ఉచితంగా ఏర్పాటుచేస్తుందని తెలిపారు. మహిళాదీక్షదారులకు ఏకాదశి దినదీక్ష 11 రోజులకు దీక్ష చేపట్టవచ్చునని ఈనెల 14న ఈ దీక్ష ప్రా రంభమవుతుందన్నారు. ప్రతిఏటా మాదిరిగానే గోవిందమాలదీక్షాదారణ దేవస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే పర్యాటకం అభివృద్ధి

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్


భీమేశ్వరాలయం వద్ద నిర్మాణంలో ఉన్న డార్మెటరీని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబు

సామర్లకోట, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం అయిన పర్యాటకం అభివృద్ధి చేసేందుకు తిరిగి పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు కృషిచేస్తున్నారని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొ న్నారు. శనివారం సామర్లకోటలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక కుమారరామ భీమేశ్వరాలయం వద్ద నిర్మాణంలో ఉన్న పలు భవనాలను, భక్తులు వినియోగించే డార్మెటరీ భవనాన్ని మంత్రి పరిశీలించారు. ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ టూరిజం పాలసీ నూతనంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు ప్రభుత్వం ఇ స్తున్న రాయితీలవలె పర్యాటక రంగానికి సైతం ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణా రాష్ట్రం తరహాలో సినీపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు గల సాధ్యా సాధ్యాలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తుందన్నారు. దీని కోసం త్రిసభ్య కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డబ్బుల బ్యాగ్‌ను తిరిగి అప్పగిస్తున్న దృశ్యం

పోలీస్ కానిస్టేబుల్ నిజాయితీ

- పొరపాటున దుస్తుల బ్యాగ్‌తోపాటు రూ.8లక్షల బ్యాగ్ ఇచ్చేసిన వస్త్రదుకాణం యజమాని
- కాసేపటికి గ్రహించి జగ్గంపేట పోలీసులకు సమాచారం
- డబ్బుల బ్యాగ్ తిరిగి అప్పగించిన కాకినాడ ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఓ పోలీస్ కానిస్టేబుల్ నిజాయితీ కనబర్చాడు. స్థానిక మెయిన్‌రోడ్‌లోని ఓ వస్త్ర దుకాణంలో శనివారం మధ్యాహ్నం కాకినాడ మూడో ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ తోట సూరిబాబు దుస్తులు కొనుగోలు చేశాడు. ఆ షాపు యజమాని అతడి దుస్తుల కవర్లతోపాటు పొరపాటున షాప్‌కు చెందిన రూ.8లక్షల ఉన్న కవరును కూడా ఆ పోలీస్ కానిస్టేబుల్‌కు ఇచ్చేశాడు. కాసేపటికి విషయాన్ని గ్రహించిన షాపు యజమాని వెంటనే కంగారుపడి స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన సీఐ శ్రీనివాస్ పొరపాటున డబ్బులు బ్యాగ్ తీసుకువెళ్లిన పోలీస్ కానిస్టేబుల్ తోట సూరిబాబును గుర్తించారు. అతడికి సమాచారం అందించి ఆ సొమ్ము తిరిగి తీసుకురావాల్సిందిగా కోరారు. వెంటనే కానిస్టేబుల్ తోట సూరిబాబు తన వద్దఉన్న రూ.8లక్షల బ్యాగ్‌ను గుర్తించి జగ్గంపేట పోలీ సులకు అందజేశారు. నిజాయితీగా నగదును తిరిగి అప్పగించిన సూరిబాబును జగ్గంపేట సీఐ శ్రీనివాస్ అభినందించారు.

నేడు రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సమావేశం

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రగ్బీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కాకినాడజిల్లా పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ తెలిపారు. సంఘ సభ్యులందరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి

దివ్యాంగురాలి మృతి

- పెన్షన్ తీసుకునేందుకు వెళ్తుండగా ఘటన


బస్సు నుంచి జారిపడి మృతిచెందిన నడవపల్లి భద్రం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం అంగరలో శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి దివ్యాంగురా లు నడవపల్లి భద్రం(54) మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.... బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం ఎండగండి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ అయిన నడవపల్లి భద్రం అంగరలోని తన అక్క పావులూరి వీరవేణి ఇంటి వద్ద ఉం టుంది. శనివారం ఉదయం అంగర నుంచి ఎండగండిలో పెన్షన్ తీసుకునేందుకు అంగర గాంధీ సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా జారిపడి బస్సు వెనుక చక్రంలో పడి మృతి చెందింది. వికలాంగురాలైన ఆమెకు ఒక కుమారుడు ఉండగా అతడు కాజులూరులో ఉంటున్నాడు. అంగర గ్రామంలో అక్క ఇంటివద్ద ఉంటూ పించన్‌తోనే ఆమె జీవనం కొనసాగిస్తుంది. దీనిపై మండపేట రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ బుచ్చిబాబు తెలిపారు.

భద్రమ్మ కుటుంబానికి అండగా ఉంటాం: జేసీ

కె.గంగవరం: పింఛన్ తీసుకోవడానికి బస్సు ఎక్కుతూ ప్రమాదానికిగురై ప్రాణాలు విడిచిన నడవపల్లి భద్రం కుటుంబానికి అండగా ఉంటామని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. భద్రం శనివారం కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో ప్రమాదానికిగురై చనిపోయింది. అక్కడి నుంచి పోస్టుమార్టం పూర్తి చేసుకుని స్వగ్రామం యండగండి తరలించారు. యండగండిలో అంత్యక్రియలు పూర్తి చేశారు. భద్రం కుమారుడు దుర్గాప్ర సాద్‌ను ఇతర కుటుంబ సభ్యులను జేసీ శనివారంరాత్రి యండగండిలో పరామర్శించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆమె వెంట రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఆర్.ఐ.వెంకట్రావు, వీఆర్వో బాబి, సర్పంచ్ చోడే గోవిందరాజు ఉన్నారు.


యండగండిలో భద్రం కుమార్తును పరామర్శిస్తున్న జేసీ నిషాంతి

వెంకటాపురం ఇంగ్లీష్ టీచర్ సస్పెన్షన్

రంగంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వెంకటాపురం ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్న ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు డీ.సుశీల బాధ్యతరాహిత్యంగా వ్యవహరించిన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ 1964కి లోబడి సస్పెన్షన్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో కారు శుభ్రపరచడం, ఇతర వ్యక్తిగత పనులు చేయించడంపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన తర్వాత వాస్తవాలను నిర్ధారించిన తర్వాత సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కోరుకొండ ఆలయ దత్తత నుంచి అన్నవరం ఆలయానికి విముక్తి కలిగించాలని లేఖ

అన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం దత్తత ఆలయమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత నుంచి మినహాయించాలని దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దేవదాయ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియపరిచారు. ఆలయంలో పరిపాలనపరమైన ఇబ్బందుల దృష్ట్యా సిబ్బంది అన్నవరం దేవస్థానం నుంచి పంపించడం వ్యయప్రయాసలతో కూడుకోవడం తరచూ ఏదో వివాదం చుట్టుముట్టుతుండడంతో దేవస్థానం అధికారులు ఈనిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కోరుకొండ ఆలయాన్ని అన్నవరం దేవస్థానానికి దత్తతగా ఇవ్వడంతో అప్పటినుంచి పాలనాపరమైన వ్యవహారాలు అన్నవరం దేవస్థానమే చూసుకుంటూవచ్చింది. అక్కడ ఉత్సవాల నిర్వహణ, భూముల పరిరక్షణ క్లిష్టపరమైన బాధ్యతలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏటా సుమారు రూ.30 లక్షల వరకు అన్నవరం దేవస్థానం వ్యయం చేయాల్సి వస్తోంది.

సామర్లకోటలో తాడేపల్లిగూడెం 'నిట్' బృందం పర్యటన

- తాగునీటి సరఫరాను పరిశీలించిన బృందం

సామర్లకోట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీ పట్టణ ప్రజలకు రోజువారీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరాను శనివారం తాడేపల్లిగూడెంనకు చెందిన నిట్ జాతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం నలుగురు సభ్యులు సామర్లకోటకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణ తాగునీటి సరఫరాపై ప్రజ ల నుంచే గాకుండా కౌన్సిలర్ల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు నిట్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఫిల్టర్ వాటర్ స్కీంవద్ద నీటి పరిశుభ్రత, క్లోరిన్, ఆలమ్‌ల కలయిక, క్లోరినేషన్ చర్యలు, నీటి పంపింగ్ అంశాలు పరిశీ లించారు. గోదావరి జలాలు నిల్వలుచేసే వేసవి జలాశ యంలో నీటి నిల్వలు పరిశుభ్రంగా ఉన్నాయా, దుర్గంధం వెదజల్లుతున్నాయా అనే అంశాలు పరిశీలించారు. గోదావరి కాలువ నుంచి జలాశయంనకు వెళ్లే ఇన్‌లెట్, జలాశయం నుంచి ఫిల్టర్‌ప్లాంట్‌కు వెళ్లే ఇన్‌లెట్‌లను పరిశీలిం చారు. అనంతరం గోదావరి కాలువ నుంచి జలాశ యంలోకి వెళ్లే ఇన్‌లెట్ మార్గాలను సైతం పరిశీలి ంచారు. శుద్ధిచేసిన నీటిని ట్యాంకులకు పంపింగ్ వంటి అంశాలతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల నుం చి కుళాయిలకు సరఫరా వంటి అంశాలను పరి శీలించారు. ఆయా ప్రాంతాల నుంచి సుమారు 9 బావికతో నీటి నమూనాలు సేకరించి విశ్లేషణ నిమిత్తం బృందం తమ వెంట తాడేపల్లిగూడెం తీసుకువెళ్లారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ జలాశయం నుంచి రాబార్ ద్వారా శుద్ధిచేసే విధానాన్ని మరింత పెంచా ల్సి ఉందన్నారు. శుద్ధిచేసిన నీటిలో పీపీఎం శాతాన్ని పరీక్షించిన తర్వాతే ట్యాంకులకు పంపింగ్ చేయాల న్నారు. ప్రస్తుతం ఫిల్టర్ వాటర్ నిర్మించి 20 ఏళ్ల పైబడినందున పనితీరు సామర్థ్యం పరీక్షించాల్సి ఉందన్నారు. నూతనంగా ఏర్పాటుచేయాలా, ఇదే మరమ్మతులు చేపట్టాలా అనే అం శాలపై ల్యాబ్‌లో విశ్లేషణల అనంతరం నివేదికలు ప్రభు త్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ బృందంలో నిట్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ భరణి, డాక్టర్ రేష్మా, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సుభానిలు ఉన్నారు. వీరి వెంట సామర్లకోట మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాస్, ఎమి నిటీ కార్యదర్శి ఉండూరు శ్రీనివాస్, సూపర్‌వైజరు శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.


సామర్లకోటలో తాగునీటి సరఫరాపై నిట్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు పరిశీలిస్తున్న దృశ్యం

బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరి మృతి

- జాతీయ రహదారిపై భీమవరం వద్ద ఘటన


మృతులు కురసం భద్రయ్య, పొడియం రాజారావు (ఫైల్)


ఘటనలో మృతి చెందిన భద్రయ్య, రాజారావు

ఎటపాక, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎదురు గా వస్తున్న బైక్‌ను ఐరన్ లోడ్ లారీ రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు ఆది వాసీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి విజ యవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై అల్లూరి జిల్లా ఎటపాక మండలం చోడవరం పంచాయతీలోని భీమవరం గ్రామంవద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీపురం పంచా యతీలోని కన్నాపురం గ్రామానికి చెందిన కురసం భద్రయ్య, (41), పొడియం రాజారావు(31) ఇద్దరు కలిసి బైక్‌పై భద్రాచలం వెళ్లి తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నారు. ఈక్ర మంలో చింతూరువైపు నుంచి భద్రా చలం వస్తున్న ఐరన్‌లోడ్ లారీ భీమవరం వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో భద్రయ్య, రాజారావులకు తీవ్ర గాయాలతో అక్కడికక్క డే దుర్మరణం చెందారు. స్థానికులు 108 కు సమాచారంతో ఇవ్వడంతో ఇరువురిని భద్రాచ లం ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఘటన జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఇరు వురిది వ్యవసాయ కూలీ కుటుంబ నేపథ్యం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాల కు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యు లకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో మరణించిన సోమరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామం ఆటోనగర్ జంక్షన్‌వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో 80 ఏళ్ల వృద్ధుడు మృతి చెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన సోమరాజు అతడి తమ్ముడి కుటుంబ సభ్యులు కలిసి బెండపూడి బంధువుల ఇంటికి ఆటోలో వెళ్లారు. తిరిగి దివాన్‌చెరువు మీదుగా రాజమహేంద్రవరం వస్తుండగా ఆటోనగర్ సెంటర్‌లో ఓ లారీ ఆటోనగర్ లోంచి బయటకు వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బోడపాటిసోమరాజు (80) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న దొమ్మేటి అర్జునరావు, అచ్చియ్యమ్మ, మల్లిబాబులకు తీవ్రగాయాలయ్యాయి. సత్యనారాయణ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బొమ్మూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి సోమరాజు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వివాహిత హత్య కేసులో భర్తే కాలయముడు

- నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు


నిందితుడిని అరెస్ట్ చేసిన కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతి కేసులో భర్తను శనివారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. మూలపేటకు చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాలను 9 సంవత్సరాలక్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. జనవరి 18న బాల అర్ధరాత్రి సమయంలో మృతి చెందడంతో భర్త ఎవరికీ చెప్పకుండా శ్మశానంలో పూడ్చిపెట్టడంతో మృతురాలి తల్లి గింజాల లక్ష్మికి అనుమానం వచ్చింది. దీంతో ప్రసాద్‌కు వేరే అమ్మాయితో అక్రమ సంబంధం ఉందని, తన కుమార్తెను అడ్డుతొలగించుకునేందుకు ప్రసాదే హత్య చేశాడని ఆమె కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పూడ్చిపెట్టిన మృతురాలి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా బాలను మెడకు చున్నీతో బిగించి ఊపిరి ఆడకుండా చేసినట్టు రిపోర్టు రావడంతో అనుమానాస్పద మృతి కేసును హత్యకేసుగా నమోదుచేసి నిందితుడిని ఆచూకీ కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో నిందితుడు ప్రసాద్ మూలపేట వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయి తానే తన భార్యను హత్య చేశానని ఒప్పుకున్నాడని తెలిపారు. బాలకు వాంతులు వీరోచనాలతో మృతి చెందిందని తల్లికి తప్పుడు సమాచారం ఇచ్చానని అంగీకరించాడని సీఐ శ్రీనివాస్ చెప్పారు. ఈ కేసులో నిందితుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్‌కు పంపించినట్టు తెలిపారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పక్కింటికి ఎదురింటికి వెళ్ళవద్దని ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం శేషయ్యమెట్టకు చెందిన దాసరి తులసీ, శ్రీనివాస్ దంపతులకు నాగసాయి దుర్గ(12), ఓ బాలుడు సంతానం. 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ మృతి చెందాడు. దాంతో తులసీ అదే ఏడాది బోగిన నాగేశ్వరావు అనే డ్రైవర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి తల్లితో సాయిదుర్గ ఇష్టంగా ఉండడం లేదు. ఎక్కువ శాతం ఇరుగింటి వద్ద పొరుగింటి వద్ద ఉంటోంది. స్థానికంగా ఓ స్కూల్లో 7వ తరగతి చదువుతోంది. తులిసి మెయిన్ రోడ్డులోని ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి పిల్లలకు భోజనం తయారు చేసి తిరిగి పనిలోకి వెళ్లిపోతుంది. ఈ క్రమంలో శుక్రవారం దుర్గ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండడంతో మందలించి వెళ్లింది. సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి అన్నం వండి ఎదురింటి వద్ద ఉన్న దుర్గను పిలిచి మందలించింది. దీంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఆపై ఇంట్లో ఉండాలనిచెప్పి తల్లి వెళ్లిపోయింది. తల్లితో గొడవ పడిన దుర్గ తల్లి వెళ్ళిపోయాక ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుంది. రాత్రి తల్లి వచ్చి చూసే సరికి ఫ్యానుకు వేలాడుతు కనిపించింది. స్థానికుల సహకారంతో దుర్గను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీ తరలించారు.

పోలీసు లాంఛనాలతో ఎస్ఐకు అంత్యక్రియలు

- నివాళులర్పించిన అడిషనల్ ఎస్పీ ప్రసాద్
- అంత్యక్రియలకు హాజరైన సహచర ఎస్ఐలు, సిబ్బంది
- గంగవరంలో విషాద ఛాయలు


ఎస్ఐ మూర్తి పార్థీవదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు, కోటిపల్లి శ్మశానవాటిక వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు

కె.గంగవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తణుకులో చనిపోయిన ఎస్ఐ ఆదుర్తి జీ.ఎస్.మూర్తి పార్థీవదేహాన్ని పోస్టుమార్టం అనంత రం శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకువచ్చారు. శనివారం ఉదయం నుంచి గ్రామస్తులు, సహచర పోలీసు సిబ్బంది, బంధువులు సందర్శించి నివాళులర్పించారు. మూర్తి భౌతికకాయాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారు సానుభూతి తెలిపారు. మూర్తి పనిచేసిన పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చిన పోలీసులు ఆయన బ్యాచ్‌కు చెందిన సహచర ఎస్ఐలు మూర్తి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుమ్మరి శాలివాహన సంఘం అధికారప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, ప్రచార కార్యదర్శి రాలి శ్రీనివాసవడయార్, కె.గంగవరం నాయకులు ఏడిద నాగరాజు, తదితరులు పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కోటిపల్లి గోదావరి ఒడ్డున స్మశానవాటికకు తరలించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు.

ఎస్ఐ మూర్తి కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ): నిరుపేద కుటుంబం నుంచి పోలీసుశాఖలో ఎస్ఐ స్థాయి అధికారిగా ఎదిగిన ఏజీఎస్ మూర్తి అకాల మరణం బాధాకరమని మంత్రి సుభాష్ ఆవేదన వ్యక్తం చేశారు. తణుకులో ఎస్ఐ మూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎస్ఐ మూర్తి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి కష్టపడి చదువుకుని ఎస్ఐగా ఉద్యోగం సంపాదించారని అన్నారు. ఆయన మరణవార్త కలచివేసిందన్నారు. ఎస్ఐ మూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఎస్ఐ మూర్తి మృత దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

పార్టీ పటిష్టానికి కృషి

మామిడికుదురు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గంలో వైసీపీని పటిష్ఠ పరచడానికి కృషి చేస్తున్నామని నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో శనివారం మండల విస్తృతస్థాయి సమావేశం కొమ్ముల రాము అధ్యక్షతన జరిగింది.

ఆర్యవైశ్య ప్రముఖులకు సన్మానాలు

అల్లవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గౌతమేశ్వర శివాలయం వద్ద మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, జిల్లా అధ్యక్షుడు బాబీ, కోశాధికారి కృష్ణమోహన్, వాసవి సూరిబాబు తదితరులను సన్మానించారు. సంఘం మండల అధ్యక్షుడు గమిడి సూరిబాబు పాల్గొన్నారు.

రూ.4.21కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు: ఎమ్మెల్యే

ముమ్మిడివరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పలు పనులను పూర్తిచేసేందుకు రూ.4.21కోట్లు సీఎస్సార్ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ప్రతిపాదించిన పనులను శనివారం ఓఎన్జీసీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. తొలుత ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టు 1100మీటర్ల పొడవు, 10మీటర్ల వెడల్పున వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణం, సుందరీకరణ, జిమ్ ఏర్పాటు వంటి పనులకు సంబంధించి ఓఎన్జీసీ ప్రతినిధులు, నగరపంచాయతీ కమిషనర్ పి.రవివర్మ, ఏఈ పీవీ సుధాకర్‌తో కలిసి చర్చించారు. అ


గురుకుల పాఠశాలలో మౌలిక వసతులపై విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నంతరం ముమ్మిడివరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ టి.గంగాభవానీతో అక్కడ కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు స్థానిక మీడియాతో మాట్లాడారు. ఓఎన్జీసీ సీఎస్సార్ నిధుల మంజూరుకు ఓఎన్జీసీ ఈడీకి ప్రతిపాదనలు నివేదించామన్నారు. ఈనిధులు త్వరలోనే మంజూరవుతాయని, పనులు ప్రారంభించడం కూడా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ములపర్తి బాలకృష్ణ, దొమ్మేటి రమణకుమార్, కాకర్లపూడి రాజేష్, వాసంశెట్టి అమ్మాజీ, విళ్ల వీరాస్వామినాయుడు, కడలి నాగు, పిల్లినాగరాజు, సత్తి నూకరాజు, కమిషనర్ పి.రవివర్మ, ఏఈ పీవీ సుధాకర్, ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డీఈ సుబ్బరాజు, ఓఎన్జీసీ ప్రతినిధులు ఉన్నారు.

బాధితుడి వైద్య సేవల కోసం ఆందోళన

- అధికారుల జోక్యంతో సాయం అందించేందుకు లారీ యజమాని అంగీకారం
- సాయంత్రం వరకు ట్రాఫిక్ స్తంభన

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో శుక్రవారం రాత్రి లారీ ఢీ కొట్టి తీవ్రంగా గాయపడిన కుంచే అనిల్‌కుమార్‌కు మెరుగైన వైద్యం కోసం లారీ యజమాని సహకరించాలంటూ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులు ఆందోళన కొనసాగించారు. అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారిపై ధర్నా చేశారు. రోజంతా ట్రాఫిక్ స్తంభించింది. అమలాపురం- ఎస్.యానాం రహదారిని విస్తరించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ వాసా దివాకర్, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంతకుమార్, ఉప్పలగుప్తం ఎస్ఐ సీహెచ్ రాజేష్ ఆధ్వర్యంలో సాయంత్రం జరిగిన చర్చల్లో


సహాయం అందించాలంటూ అమలాపురం-ఎస్.యానాం రహదారిపై ఆందోళన చేస్తున్న స్థానికులు

బాధితునికి రూ.3లక్షలు వైద్యం కోసం ఇచ్చేందుకు లారీ యజమాని అంగీకరించడంతో ఆందోళన విరమించారు. జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, కుసుమ వెంకన్న, కాట్రు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.20వేలు ఇచ్చిన సీఐ

అనిల్‌కుమార్‌కు వైద్య ఖర్చులకు లారీ యజమాని ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆందోళన జరుగుతుండగా అక్కడకు వచ్చిన అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. లారీ యజమాని ఎప్పటికీ రాకపోవడంతో ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందు క్షతగాత్రునికి వైద్యం అందాలి కదా! అంటూ తాను స్వయంగా సీఐ రూ.20వేలు ఇచ్చారు. వెంటనే ఎస్ఐ రాజేష్, తహసీల్దార్ దివాకర్ స్పందించి రూ.10వేల వంతున ఇచ్చారు. జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు రూ.10వేలు ఇచ్చారు. మరో కొంత మంది తమవంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. మొత్తం రూ.2లక్షల సొమ్మును ఆసుపత్రికి పంపించారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు: జేసీ


ఉద్యోగుల సమస్యలు వింటున్న జేసీ నిషాంతి

అమలాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరిధిలోని ఉద్యోగుల సమస్యలకు పూర్తిస్థాయిలో తగు పరిష్కార మార్గాలు చూపనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం కోనసీమ రెవెన్యూ కేర్ పేరిట ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జేసీ నిర్వహించారు. పలువురు రెవెన్యూ, పౌర సరఫరాలు, సర్వే ఉద్యోగులు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. 166ప్రభుత్వ ఉత్తర్వుల ను అనుసరించి గ్రేడ్-2 వీఆర్వోలను గ్రేడ్-1గా మార్చాలని, జీతాలు ఇవ్వడంలో తహశీల్దార్లు జాప్యం చేస్తున్నారని, వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని, తహశీల్దార్లను డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ అధికారులుగా నియమించాలని కోరారు. విధి నిర్వహణలో సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జేసీ నిషాంతి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహశీల్దార్ చినబాబు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా దిరిశాల బాలాజీ

అంతర్వేది, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో జరిగే అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమక్షంలో ఉత్సవ కమిటీ చైర్మన్‌గా దిరిశాల బాలాజీని నియమించారు. ముందుగా 22మందితో కూడిన ఉత్సవ కమిటీతో పాటు 11మందితో కూడిన సేవా కమిటీ సభ్యులను కూడా నియమించారు. శనివారం స్వామివారి కల్యాణ షెడ్డులో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావంతో ఎవరైతే ఉత్సవాల విజయానికి సహకరిస్తారో వారిని ఎంపిక చేసి పదిరోజుల పాటు స్వామివారికి సేవ చేసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 4 నుంచి 13వరకు జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో భక్తులకు ఎక్కడా అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. అనంతరం ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయాలు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదేశాలతో స్వామివారికి భక్తిశ్రద్ధలతో సేవ చేసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, డెల్టా ప్రాజెక్టు చైర్మన్‌లు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, ఆకన బాబ్జినాయుడు, అడబాల సత్యనారాయణ, చాగంటి స్వామి, ఎంపీటీసీ బైరా నాగరాజు, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించి ప్రధానమైన 132 కేవీ రామచంద్రపురం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పరికరాలు మార్పు చేయుటలో భాగంగా ఆదివారం అమలాపురం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం వచ్చే పరిస్థితి ఉంటుందని కాకినాడ ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖ్వాజార హంతుల్లా, అమలాపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

బ్రహ్మానందం జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ రంగంలో హాస్యానికి కొత్త ఒరవడి తీసుకువచ్చిన హాస్యబ్రహ్మ బ్రహ్మానందం జన్మదిన వేడుకలను దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవాసంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బ్రహ్మానందం జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. సంఘ నాయకులు గున్నేపల్లి భీమశంకరం, డీఎస్ఎన్ కుమార్, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, పాటి వెంకటరమణ, జల్లి స్వామిఅయ్యప్ప, యాలంగి రామకృష్ణ పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే

కాట్రేనికోన, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పల్లంకుర్రు పీహెచ్‌సీ భవనం, విద్యుత్ సబ్ స్టేషన్లను త్వరలో పూర్తి చేస్తామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. శనివారం పల్లంకుర్రులో ఆయన ఓఎన్జీసీ అధికారులతో కలిసి పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. అవసరమైన నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. త్వరలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, కంచుస్తంభం కృష్ణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, రేవు తిరుపతిరావు, వాసంశెట్టి రాజేశ్వరరావు, మంతెన సూరిబాబు, టీవీ బాబాయ్, ఇసుకపట్ల రాంబాబు, పెన్మెత్స రాంబాబు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి సరెళ్ల వేంకటరత్నం (సవేర) రచించిన భారత రాజ్యాంగం (బిట్ బ్యాంక్-సమగ్ర సమాచారం) పుస్తకాన్ని ప్రముఖ న్యాయవాది రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ఆవిష్కరించారు. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం సంక్లిష్ట రాజకీయాల్లో భారత రాజ్యాంగం గురించి ప్రతీ పౌరుడు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని అందుకు ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. ముంగండ ఆశీర్వాదం, సరెళ్ల రామచంద్రరావు, పొలమూరి వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల ఆనందరావు, కొల్లు ఉదయ్‌కుమార్, తోట బాలకృష్ణ, విజయభారతి పాల్గొన్నారు.

క్షేత్రపాలకుని ఆలయంలో ప్రత్యేక పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవంలో మూడో రోజు స్వామివారికి ఉదయం 8గంటలకు నిత్యోపాసన, బలిహరణములు, రాత్రి 7 గంటలకు ప్రత్యేక పూజలతో పాటు నిత్యోపాసన, బలిహరణ నిర్వహించారు. అర్చక స్వాములు కల్యాణమూర్తులను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లాలో 1.43లక్షల ఎకరాల్లో ఈ-పంట నమోదు


పోతవరంలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

పి.గన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,43,614 ఎకరాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బోసుబాబు తెలిపారు. పోతవరంలో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేసి అనంతరం మాట్లాడారు. ఈ-పంటనమోదు ఈనెల20వ తేదీ కల్లా పూర్తయ్యే విధంగా సంబంధిత అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయశాఖ సిబ్బందికి ఆదేశాలు జారీచేశామని తెలిపారు. భూ సర్వే నెంబరు, పంట వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలన చేసి వీఆర్వో, గ్రామస్థాయి వ్యవసాయశాఖ సిబ్బంది సమన్వయంతో ఈకేవైసీ పూర్తిచేస్తారని వివరించారు. ఈకేవైసీ ప్రక్రియ కూడా వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,57,650 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాని, వారంరోజుల్లో మరో పదివేలు ఎకరాలు వరకు నాట్లు పడతాయన్నారు. జిల్లాలో 21,000టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కల్యాణ్‌సూర్యకుమార్, గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

గజమాల యాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురంటౌన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించే గజమాల యాత్ర ప్రశాంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అమలాపురం ఆర్డీవో కొత్తమాధవి అన్నారు. స్వామివారి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా గజమాల యాత్ర యానాం నుంచి అంతర్వేది వరకు నిర్వహించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. అమలాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శనివారం పోలీసు, ఇతర కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గజమాల యాత్ర ఏర్పాట్లపై తొలుత పోలీసు అధికారులతో కమిటీ సభ్యులు చర్చించారు. పటిష్టమైన ఏర్పాట్ల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఈనెల7వతేదీన గజమాల యాత్ర ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆర్డీవో పోలీసు అధికారులకు సూచించారు. అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు టీఎస్ఆర్కే ప్రసాద్, సుంకర మురళీమోహన్, పట్టణ, రూరల్ సీఐలు పి.వీరబాబు, ప్రశాంత్ కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మల్లాడిని ఘనంగా సత్కరించిన ఉద్యోగులు

యానాం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి):పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును పుదుచ్చేరిలో ఉన్న 25మంది ఎంటీఎస్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. 6నెలల క్రితం డైలీరేటర్‌గా ఉన్న వీరు పదోన్నతిపై పుదుచ్చేరిలోని వివిధ శాఖలకు బదిలీ అయ్యారు. కుటుంబసభ్యుల ఇబ్బందులను ఢిల్లీ ప్రతినిధి మల్లాడి ఈవిషయం సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో వారిని యానాం బదిలీ చేశారు. దీంతో వారు శనివారం పుదుచ్చేరిలో మల్లాడి స్వగృ



హం వద్దకు వెళ్లి మల్లాడిని సత్కరించారు. మల్లాడి కృషివల్లే యానానికి బదిలీ అయ్యామని, సహకరించి సీఎం ఎన్.రంగసామి, ఇతర అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాలబాలాజీ స్వామికి విశేషపూజలు



మామిడికుదురు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజల నిర్వహించారు. వేకువజామునే పండితులు సుప్రభాతసేవ నిర్వహించి తొలిహారతి ఇచ్చారు. భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తమ తలనీలాలు, మొక్కులు చెల్లించారు. శనివారం స్వామివారిని 1400మంది దర్శించుకుని 650 మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,08,503 ఆదాయం సమకూరిందని ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించిన ముగ్గురు విద్యార్థులు



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించినట్టు అకాడమీ ప్రిన్సిపాల్, కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. పెద్దాపురం జవహర్ నవోదయా స్కూలులో చదువుతోన్న కొండా శివేంద్ర 1406 రేటింగ్ పాయింటు, అమలాపురం విద్యానిధి విద్యార్థులు పితాని రాఘవేంద్ర 1443 రేటింగ్ పాయింట్లు, సాధనాల శ్రీసంతోష్ 1494 రేటింగ్ పాయింట్లు సాధించినట్టు వివరించారు. ఇప్పటివరకు విక్టరీ అకాడమీ విద్యార్థులు 30మంది అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కవురు జగదీష్, ఆకుల బాపన్ననాయుడు తదితరులు అభినందించారు.

మహాకుంభమేళాకు ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా యాత్రకు అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల12వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు అమలాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని, 8రోజులు జరిగే యాత్రలో భాగంగా భువనేశ్వర్, పూరీ, కోణార్క్, ప్రయాగ్‌రాజ్-కుంభమేళా, వారణాశి, అయోధ్య, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణిసంగమస్నానం, విశ్వనాథ దర్శనం వంటి పుణ్యక్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. ప్రయాగ్‌రాజ్, కాశీ క్షేత్రాల్లో ఒకరోజు బస చేసే ఏర్పాట్లతో పాటు ప్రయాణికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తారన్నారు. సరికొత్త సూపర్ లగ్జరీ వీడియోకోచ్ బస్సులను ఇందుకోసం సిద్ధం చేశామన్నారు. మహాకుంభ మేళా యాత్రలో భాగంగా ప్రయాణికులందరూ ఎక్కడ ఉన్నా బస్సు వద్దకు చేరుకునే విధంగా ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, బస్సు బయలుదేరే సమయంలో సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తామన్నారు. యాత్రకు ఒక్కొక్కరికీ రూ.10,800టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. మహాకుంభమేళాకు వెళ్లే భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సెల్ 9959225576ను సంప్రదించాలన్నారు.

భక్తులతో కిటకిటలాడిన వేంకటేశ్వరాలయం

అయినవిల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నల్లచెరువులో గల అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని, రాజ్యాంగానికి బద్ధులై హక్కులను అనుభవిస్తూ బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని రవీంద్ర హైస్కూలు కరస్పాండెంట్ పి.లక్ష్మీశ్రీనివాసన్ పేర్కొన్నారు. ముమ్మిడివరం రవీంద్ర ప్రాథమిక హైస్కూలులో రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా భారత్ సంవిధాన్-గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ లక్ష్మీశ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పీవీవీఎస్ఎన్ మూర్తిరాజు, ప్రిన్సిపాల్ జ్యోతిసుధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో ఎంతో మేలు

మలికిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్‌ను ఉపయోగించుకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చునని విద్యుత్ శాఖ ఎస్ఈ రాజబాబు అన్నారు. మలికిపురం పంచాయతీ వద్ద మలికిపురం గ్రామం సౌర విద్యుత్‌కు మోడల్ గ్రామంగా ఎంపికైన సందర్భంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాజబాబు మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని, సౌరవిద్యుత్‌కు సబ్సిడీ వస్తుందన్నారు. లక్ష్యం మేరకు గృహస్తులు సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటే గ్రామానికి కూడా ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, ఏడీఈ శ్రీనివాస్, డీఈ విజయానంద్, గెడ్డం తులసీభాస్కర్, జక్కంపూడి శ్రీదేవి, కె.సీతామహాలక్ష్మి, గెద్దాడ నాగేశ్వరరావు, దొడ్డా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రజాలికుడు అలీకి సన్మానం




మామిడికుదురు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి చెందిన ఇంద్ర జాలికుడు (మెజీషియన్) అలీని శనివారం హైదరాబాద్‌లో పలువురు హాస్యనటులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం పుట్టినరోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లో బ్రహ్మానందం స్వగృహంలో సన్మాన కార్యక్రమం జరిగింది. గత సంవత్సరం అక్టోబరులో జరిగిన జాతీయ ఇంద్రజాల ప్రదర్శనలో బెస్ట్ మెజీషియన్ అవార్డు అందుకోవడం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. అలీని దుశ్శాలువాలతో సన్మానించి షిర్డిసాయినాథుని చిత్రపటాన్ని బహూకరించారు. మన కళాకారుడిని మనమే సన్మానించుకోవాలనే ఉద్దేశంతో ఈసన్మానం నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్య నటులు అలీ, గౌతమ్‌రాజు, జబర్దస్త్ హాస్యనటులు పాల్గొన్నారు.

పూర్తి నాణ్యతా ప్రమాణాలతో రహదారుల అభివృద్ధి

పి.గన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నిబంధనలు అనుసరించి పూర్తి నాణ్యత ప్రమాణాలతో రహదారులు అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ప్రధాన సెంటర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి అనంతరం మాట్లాడారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి అంబాజీపేట వరకు రూ.8కోట్లతో రహదారి అభివృద్ధి జరుగుతుందన్నారు. రహదారి పనులు ఎలా జరుగుతున్నాయని స్థానికులు, వర్తకులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షులు చొల్లంగి సత్యనారాయణమూర్తి, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, నక్కా సత్యనారాయణ, యడ్ల ఏసుబాస్కరావు పాల్గొన్నారు.

మూడు జిల్లాల శెట్టిబలిజ నేత బాబూరావు మృతి



అల్లవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాల శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు, బోడసకుర్రు మాజీ సర్పంచ్ దొమ్మేటి బాబూరావు(80) హైదరాబాద్‌లో మృతిచెందారు. శెట్టిబలిజ సంఘానికి ఆయన చేసిన సేవలను స్మరిస్తూ శనివారం పలువురు బాబూరావు మృతి పట్ల సంతాపం తెలిపారు. ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, యల్లమిల్లి బోస్, బొక్కా శ్రీనివాస్, సర్పంచ్‌లు రాయుడు విష్ణు, కడలి గంగాచలం, గుబ్బల రాంప్రసాద్, చెల్లుబోయిన రమేష్, దొమ్మేటి శ్యామ్‌బాబు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు బాబూరావు మృతిపట్ల సంతాపం తెలిపారు.

'సూపర్ సిక్స్' అమలులో కూటమి విఫలం

పి.గన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాస్ విమర్శించారు. పి.గన్నవరంలో జరిగిన నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు నానావస్థలు పడుతున్నారని విమర్శించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు మాట్లాడుతూ ఈనెల5న అమలాపురంలో చేపట్టనున్న వైఎస్ఆర్‌సీపీ ఫీజు పోరుబాట కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, బూడిద వరలక్ష్మి, నక్కా వెంకటేశ్వరావు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, కొంబత్తుల ఏసు, దేశరాజు సీతారామయ్య, యన్నాబత్తుల ఆనంద్, మందపాటి పాల్గొన్నారు.

కాట్రేనికోన సబ్‌స్టేషన్‌కు రెండోసారి మొండి చేయి

కాట్రేనికోన, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేయవలసిన 8 మెగావాట్స్ పీటీఆర్‌ను చెయ్యేరు సబ్‌స్టేషన్‌కు తరలించారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అధికారులు తీసుకున్న నిర్ణయం 11గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు రెండవ సారి మొండి చెయ్యి చూపించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలో 16,169, చెయ్యేరు సబ్‌స్టేషన్ పరిధిలో 3,806 హౌస్ సర్వీసులున్నాయి. అయితే చెయ్యేరులో ఆక్వా సాగుపై ప్రత్యేక ప్రేమను చూపిస్తూ కాట్రేనికోన సబ్‌స్టేషన్ పరిధిలోని గృహ సర్వీసు లబ్ధిదారులకు తీరని అన్యాయం చేశారు. కాట్రేనికోన సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కువ గృహ సర్వీసులు, లోవోల్టేజీ సమస్య ఉన్నప్పటికీ 8మెగావాట్స్ పీటీఆర్‌ను చెయ్యేరు తరలించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనిపై ఉన్నత, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వినియోగదారులు హెచ్చరిస్తున్నారు. ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబును వివరణ కోరగా అంచనాలు రూపొందిస్తామన్నారు.

కొండుకుదురు సర్పంచ్‌కు పితృవియోగం

అయినవిల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొండుకుదురు గ్రామ జనసేన సీనియర్ నాయకుడు, కొండుకుదురు గ్రామ సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ తండ్రి మేడిద అబ్బులు శనివారం మృతిచెందారు. అబ్బులు మృతదేహానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ శివరామ్ మృతికి సంతాపం

ముమ్మిడివరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్, స్టాంపు శాఖ డీఐజీ శివరామ్ ఆకస్మిక మృతి పట్ల ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ ఎం.సుధాకర్ సంతాపం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది చిలకా దొరబాబు, నూకరత్నం, చిట్టిబాబు, లక్ష్మీ, కొండబాబు, దస్తావేజు లేఖర్లు యల్లాప్రగడ జగన్నాథరావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, అయినాపురపు గోపాలకృష్ణ, నార్ని బుజ్జి, సలాది చిట్టిబాబు, ఎం.నాగబాబు, అయినాపురం వంశీ, చవటపల్లి ఆదినారాయణ, బొక్కా రఘు, తాడి వాసు, అర్ధాని సత్తిబాబు, అర్ధాని సూరిబాబు పాల్గొన్నారు.

223మంది విద్యార్థులు గైర్హాజరు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోన్న విద్యార్థులకు శనివారం నైతికత-మానవ విలువలు పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షకు 223మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. జిల్లాలో 13,448మంది విద్యార్థులకు గాను 13,275మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. ఇంటర్మీడియట్ కమిషనర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆఫ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సిబ్బంది పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని 3వ తేదీ సోమవారం పర్యావరణ విద్యపై పరీక్ష నిర్వహిస్తామన్నారు.

12న అసెంబ్లీ సమావేశం

యానాం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం ఈనెల12న నిర్వహించనున్నట్లు స్పీకర్ సెల్వం తెలిపారు. పుదుచ్చేరిలో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. త్వరలో అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలు చర్చిస్తామన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీవో

అంబాజీపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తొండవరం, వాకలగరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో జీవీ సరోవర్ శనివారం పరిశీలించారు. నిబంధనలు, కొలతల ప్రకారం పనులు నిర్వహించాలని ఎంపీడీవో సూచించారు. మస్తర్లు, పనుల ప్రతిపాదనలు పరిశీలించారు. ఆయన వెంట ఉపాధి హామీ ఏపీవో అడపా వెంకటకృష్ణ ఉన్నారు. ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎంపీడీవో మండలంలో పరిశీలించారు. మండలంలో 9142పింఛన్లకు రూ.3.74కోట్లు మంజూరయ్యాయన్నారు.

'వేధింపుల కేసును నిర్వీర్యం చేస్తున్న నిందితుడు'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కరప మండలం వాకాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొందరు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు వీఎస్ రామారావుకు స్టేషన్ బెయిల్ మంజూరు చేయడం సహేతుకంగా కాదని మానవహక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. పోక్సో యాక్టులో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం వల్ల దర్యాప్తుకు ఆటంకం కలిగిస్తారన్నారు. ఈకేసు విచారణ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నిజనిర్ధారణ బృందంలో ఉన్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్, ఉపాధ్యక్షుడు ఎ.రవి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, ప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్ కోరారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని సత్వరం పరిష్కరించేందుకు పురపరిపాలన శాఖ రీజనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 8 నుంచి 9గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మెప్మాతో పాటు వివిధ విభాగాల శాఖాధిపతులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను వింటారన్నారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను సెల్ 9849905805కు తెలియచేయాలన్నారు. ఫోన్ ద్వారా గానీ స్వయంగా పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చిగానీ తమ సమస్యలను వివరించవచ్చునన్నారు. చెత్త వాహనాలు సమయానికి రాకపోయినా, డ్రైన్లు శుభ్రం చేయకపోయినా, వీధి దీపాలు, కుక్కల బెడద, రోడ్ల మరమ్మతులు వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువస్తే వాటిని సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

మండపేట



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

కొత్తపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,49,886 ఒకరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



భీమేశ్వరస్వామి కల్యాణోత్సవ ఏర్పాట్లకు రాట ముహూర్తం చేస్తున్న ఈవో

భీమేశ్వరస్వామి కల్యాణోత్సవానికి రాట ముహూర్తం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవ ఏర్పాట్లకు సంబంధించి శనివారం రాట మూహూర్తం జరిపారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 11.50 గంటలకు ఆలయ సహాయ కమీషనరు అల్లు వెంకట దుర్గా భవానీ, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం రాటమూహూర్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణదారులు, ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.



రాయవరంలో సైన్స్ ప్రయోగాలు తిలకిస్తున్న జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం

విద్యార్థుల్లో స్ఫూర్తికి సైన్స్ ప్రయోగాలు దోహదం

రాయవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగించేందుకు సైన్స్ ప్రయోగాలు ఎంతో ఉపకరిస్తాయని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం రాయవరం సాయితేజా స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలను ఆయన తిలకించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి వారిని ప్రోత్సహిస్తే వారు మరిన్ని అద్భుతాలు సాధిస్తారన్నారు. అనపర్తి, బిక్క వోలు ఎంఈవోలు ఎం.రామకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసరావు, డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు సైన్స్ ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. రాయవరం, అనపర్తి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 800 మంది వీటిని తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ కర్రి భానురేఖ, సందీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోస్టాఫీసులో బీమా దినోత్సవాన్ని జరుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

మండపేటలో పోస్టల్ బీమా దినోత్సవం

మండపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించి 141 ఏళ్లయిన సందర్భంగా శనివారం మండపేట పోస్టాఫీసులో ఉద్యోగులు పోస్టల్ బీమా దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పోస్టాఫీసులో ఉద్యోగులు కేక్ కట్ చేశారు. అనంతరం రెండు లక్షల మేర పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీని సేకరించారు. పోస్టల్ బీమా వల్ల కలిగే ప్రయోజనాలను రామచంద్రపురం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కొండపల్లి సూర్యనారాయణ, పోస్టల్ ఉద్యోగులు కేవీ నారాయణరావు, విశ్రాంత ఉద్యోగి టి.పుల్లేశ్వరరావు, ఏడీఎం షరీఫ్, శ్రీనివాస్, వెంకట్రావు, ఎం.అనూష, ఈశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సందిపూడి హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తక పఠనంపై వివరిస్తున్న కవి కృష్ణశ్రీ

పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి పెరగాలి

ఆలమూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని కవి, అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కృష్ణశ్రీ అన్నారు. ఆలమూరు మండలం సందిపూడి జడ్పీ హైస్కూల్‌లో శనివారం బాల మందిరం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాహిత్య పఠనం, కథ తయారీ, బాషా నైపుణ్యం, పాట లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అప్పనపల్లి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

అప్పనపల్లి ఆలయానికి భక్తజనం

మామిడికుదురు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజల నిర్వహించారు. వేకువజామునే పండితులు సుప్రభాతసేవ నిర్వహించి తొలిహారతి ఇచ్చారు. భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు తమ తలనీలాలు, మొక్కులు చెల్లించారు. శనివారం స్వామివారిని 1400మంది దర్శించుకుని 650మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,08,503 ఆదాయం సమకూరిందని ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

చెరువులు పాడవుతున్నా పట్టించుకోరా..?

• సర్పంచ్ సాయి ఆవేదన • ఇంట్లోని వాడకం నీరు చెరువులోకి వదిలేస్తుండటంపై అసహనం

కె.గంగవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గతంలో గ్రామాల్లోని చెరువుల నీటిని గృహావసరాలకు ఉపయోగించుకునేవారు. కొన్నేళ్ల క్రితం వరకు తాగునీటికి చెరువులే ఆధారంగా ఉండేది. కాలక్రమేణా రక్షిత మంచినీటి ట్యాంకుల ద్వారా ప్రభుత్వాలు తాగునీరు సరఫరా చేయడంతో చెరువుల ప్రాధాన్యం తగ్గింది. అప్పటి నుంచి ఆయా చెరువులను పశువులను శుభ్రం చేసుకోవడానికి, పశువుల తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. మరోవైపు చేపల పెంపకం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవడం చేస్తున్నారు.

చెరువుల్లోకి వాడకం నీరుపై ఆగ్రహం

శివల గ్రామంలో మంచినీటి చెరువు, పశువుల చెరువులు ఉన్నాయి. ఈ రెండు చెరువుల్లోకి చుట్టుపక్కల వారు ఇంట్లోని మురుగు నీటిని పైపుల ద్వారా మళ్లించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టుపక్కల ఉంటున్న వాళ్లు ఇంత బాహాటంగా చేస్తున్న పంచాయతీ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదితప్పని చెప్పినా వినడం లేదని సర్పంచ్ అనసూరి సాయి ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ హోదాలో తాను చెప్పి చూసినా స్థానికులు సహకరించడం లేదని ఆయన వాపోయారు. పంచాయతీ యంత్రాంగం మురుగు నీటిపైపులు తొలగించి, చెరువులను పరిరక్షించాలని ఆయన జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.





ఇళ్లలోని వాడకం నీటిని చెరువులోకి మళ్లించిన పైపులైన్. పక్క చిత్రంలో రంగుమారిన శివల చెరువు నీటిని పరిశీలిస్తున్న సర్పంచ్ సాయి

తాగునీటి సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నేటి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వల్ల తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడనుందని కమిషనర్ అయ్యప్ప నాయుడు తెలి పారు. ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.



పినపళ్లలో గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక బృందం

కోనసీమ చరిత్ర రూపకల్పనలో

సమగ్ర సర్వే

జిల్లాలో మొదటి విడతలో 57 గ్రామాల ఎంపిక

ఆలమూరు మండలం పినపళ్లలో సమగ్ర సర్వే

ఆలమూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా చరిత్రను రూపకల్పన చేయడంలో భాగంగా గ్రామాల నేపథ్యంపై సమగ్ర సర్వే చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం ఆలమూరు మండలం పినపళ్లలో రెవెన్యూ శాఖ అధ్వర్యంలో జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఆగ్రామ సమగ్ర విచారణ చేపట్టారు. జిల్లాలో మొదటి విడతగా 57 గ్రామాలను ఎంపిక చేశారని సర్వే బృందం వివరించింది. పినపళ్లలో రవిశంకర్ నేతృత్వంగా ఆరుగురు బృందం సమగ్ర సర్వే చేసింది. దీనిలో గ్రామం నేపథ్యంతోపాటు రాజకీయ ప్రాముఖ్యత, రాజకీయ నాయకుల వివరాలతోపాటు గ్రామానికి ఈపేరు ఎలా వచ్చిందనే విషయంపై గ్రామస్తులను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. గ్రామంలో సమస్యలు, ఇతర అంశాలపై గ్రామస్తుల నుంచి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజల జీవన విధానం, ఎక్కువ మంది ఏరంగంపై ఆధారపడి జీవిస్తున్నారనే అంశాలపై గ్రామంలోని వివిధ వర్గాల వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. ఈ సర్వేపై జిల్లా నేపథ్యం సేకరణ చేయడమేనా లేక ఏదైన ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయంపై ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తదితరులు

భవన నిర్మాణ కార్మికుల సంఘం

క్యాలెండర్ ఆవిష్కరణ

రాయవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీభక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన క్యాలెండర్‌ను శనివారం వక్తలు ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు కర్రి తాతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి వితరణతో 10 కుర్చీలు, శ్రీదుర్గా ప్రసాద్ క్లాత్‌షాపు వితరణతో 10 కుర్చీలు, టేబుల్ బహూకరించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గండి చంద్రరావు, కార్యదర్శి కన్నూరి శ్రీను, జాయింట్ సెక్రటరీ లంక చందు, ట్రెజరర్ తాడి రామారెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడి ఆలయంలో

ప్రత్యేక పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవంలో మూడో రోజు స్వామివారికి ఉదయం 8గంటలకు నిత్యోపాసన, బలిహరణములు, రాత్రి 7 గంటలకు ప్రత్యేక పూజలతో పాటు నిత్యోపాసన, బలిహరణ నిర్వహించారు. అర్చక స్వాములు కల్యాణమూర్తులను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి వేద మంత్రోచ్ఛారణల నడుమ అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అంగరలో దాత కుటుంబీకులను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు బాలబాలాజీ ఆచార్యులు

వెంకన్న ఆలయానికి విరాళం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న అలివేలుమంగ, గోదాదేవి సమేత వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిమిత్తం ఒకదాత రూ. 25 వేలు విరాళం అందించారు. రాయవరం మండలం కూర్మాపురానికి చెందిన వైట్ల వెంకట్రావు, కళావతి దంపతులు కుమారుడు వెంకట నరేష్, వీరవేణి దంపతులు, కుమారుడు వెంకట నితేష్ కుమార్తె ఐశ్వర్యలు ఈ విరాళాన్ని అందించినట్టు ఆలయ కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబీకులను ఆలయ అర్చకులు కె.బాలబాలాజి ఆచార్యులు స్వామివారి శేషవస్త్రంతో సన్మానించి స్వామివారి ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబీకులు, ఆలయ కమిటీ, పలువురు భక్తులు పాల్గొన్నారు.



అంగరలో సత్తెమ్మతల్లి సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా సత్తెమ్మతల్లి సంబరం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో సత్తెమ్మతల్లి సంబరాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మేడిశెట్టి వారి ఆరాధ్యమైన సత్తెమ్మతల్లిని అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో బాజాభజంత్రీల మధ్య ఊరేగుతూ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమంలో మేడిశెట్టి కుటుంబీకులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు ఎనర్జీ సహాయకుల వినతిపత్రం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ సహాయకులకు విద్యుత్‌శాఖలో విలీనం చేసి జెఎల్‌ఎంగా పదోన్నతి కల్పించి ఏపీఎస్ఈబి రెగ్యులేషన్స్ వర్తింప చేయాలని సచివాలయ ఎనర్జీ సహాయకుల యూనియన్ నాయకులు మంత్రి సుభాష్‌ను కోరారు. శనివారం మంత్రికి యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఎనర్జీ సహాయకులను పూర్తిస్థాయిలో విద్యుత్‌శాఖలో విలీనం చేసి విద్యుత్‌శాఖ ఉద్యోగులకు వర్తించే విధంగా ఏపీఎస్ఈబి రెగ్యులేషన్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎనర్జీ సహాయకులు

అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించిన ముగ్గురు విద్యార్థులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించినట్టు అకాడమీ ప్రిన్సిపాల్, కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. పెద్దాపురం జవహర్ నవోదయా స్కూలులో చదువుతోన్న కొండా శివేంద్ర 1406 రేటింగ్ పాయింట్లు, అమలాపురం విద్యానిధి విద్యార్థులు పితాని రాఘవేంద్ర 1443 రేటింగ్ పాయింట్లు, సాధనాల శ్రీసంతోష్ 1494 రేటింగ్ పాయింట్లు సాధించినట్టు వివరించారు. ఇప్పటివరకు విక్టరీ అకాడమీ విద్యార్థులు 30మంది అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కవురు జగదీష్, ఆకుల బాపన్ననాయుడు తదితరులు అభినందించారు.

ఏడిదలో ఉచిత పశు వైద్య శిబిరం

మండపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతుల సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.అనిత కోరారు. ఏడిద గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. శిబిరాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు ప్రారంభించారు. శిబిరంలో వంద పశువులకు పశు వైద్యులు పలు పరీక్షలు చేశారు. వారికి బీఎస్ఆర్ ట్రస్టు అందించిన పశువుల మందులను రైతులకు పంపిణీ చేశారు. పది గ్రామాలకు చెందిన 200 మంది పాడి రైతులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. బీఎస్ఆర్ ట్రస్టు సభ్యులు బలుసు వెంకట్రావు, గుణ్ణం వీర్రాజు మందులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులతోపాటు గ్రామానికి చెందిన గొడవర్తి వీర్రాజు సత్యనారాయణమూర్తి, యర్రబ్బు, మేకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏడిదలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థుల ర్యాలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో చైతన్య విద్యార్థుల స్మార్ట్ లివింగ్‌లో భాగంగా శనివారం మెయిన్ రోడ్డులో ర్యాలీ జరిపారు. ఏఎస్‌ఐ మల్లికార్జున్‌జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో శనివారం ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో సారా అమ్మకాలు నిర్వహిస్తున్న స్థావరాలపై దాడులు జరిపారు. ఉచ్చిలికి చెందిన మార్గన సత్యనారాయణ వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ అన్నవరం తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా త్రినాథరెడ్డి

రాయవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం శనివారం సంఘం భవనంలో నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా సత్తి త్రినాధరెడ్డిని సంఘం గౌరవ అధ్యక్షుడు జి.చిట్టిబాబా ప్రతిపాదించగా సభ్యులంతా ఆమోదించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వై.సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల నియంత్రణపై నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

సైబర్ నేరాల నియంత్రణపై నాటక ప్రదర్శన

రావులపాలెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సైబర్ నేరాల నియంత్రణపై నాటక ప్రదర్శన నిర్వహించారు. బ్యాంకు ఛీప్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను చేపట్టారు. ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ, రియల్ లైఫ్ సైబర్ మోసాల ఘటనలు తదితర అంశాలపై నాటక ప్రదర్శన నిర్వహించారు.



రజకుల బల్లల పండుగ సందర్భంగా నిర్వహించిన వేషధారణలు

ఘనంగా రజకుల బల్లల పండుగ

రావులపాలెం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని పంచాయతీ వెనుక వీధిలో ఉన్న రజకపేటకు చెందిన శ్రీ భక్తాంజనేయ రజక సంఘం ఆధ్వర్యంలో బల్లల పండుగ జరిపారు. కులదైవమైన వినాయక, ఈశ్వర విగ్రహాలను హంస వాహనంపై ఉంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, విచిత్ర వేషధారణలతో గ్రామోత్సవం జరిపారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా యాత్రకు అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల12వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు అమలాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని, 8రోజులు జరిగే యాత్రలో భాగంగా భువనేశ్వర్, పూరీ, కోణార్క్, ప్రయాగ్‌రాజ్-కుంభమేళా, వారణాశి, అయోధ్య, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణిసంగమస్నానం, విశ్వనాథ దర్శనం వంటి పుణ్యక్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. ప్రయాగ్‌రాజ్, కాశీ క్షేత్రాల్లో ఒకరోజు బస చేసే ఏర్పాట్లతో పాటు ప్రయాణికులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తారన్నారు. సరికొత్త సూపర్ లగ్జరీ వీడియోకోచ్ బస్సులను ఇందుకోసం సిద్ధం చేశామన్నారు. మహాకుంభ మేళా యాత్రలో భాగంగా ప్రయాణికులందరూ ఎక్కడ ఉన్నా బస్సు వద్దకు చేరుకునే విధంగా ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, బస్సు బయలుదేరే సమయంలో సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తామన్నారు. యాత్రకు ఒక్కొక్కరికీ రూ.10,800టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. మహాకుంభమేళాకు వెళ్లే భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సెల్ 9959225576ను సంప్రదించాలన్నారు.

వైసీపీ ఫీజుపోరు పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పిలుపు మేరకు 5న నిర్వహించనున్న ఫీజుపోరుకు సంబంధించి శనివారం రామచంద్రపురం వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.